## రెండవ పాఠం — الدرس الثاني

## రమజాను నెల ఆరంభ నిదర్శన — ثبوت دخول رمضان

రెండు విషయాల్లో ఏదైనా ఒక దానితో రమజాన్ నెల ప్రారంభమైనదని రుజువగును:

1- రమజాన్ మాసము యొక్క నెలవంక చూసినచో రోజా విధియగును. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశం ఇదే:

إِذَا رَأَيْتُمْ الْهِلَالَ فَصُومُوا وَإِذَا رَأَيْتُمُوهُ فَأَفْطِرُوا

**నెలవంక చూసి రోజా ఉండండి. నెలవంక చూసి ఇఫ్తార్ (పండుగ) చేయండి.** (బుఖారి 1909, ముస్లిం 1081).

విశ్వాసము (నీతి నిజాయితీగల) ఒక వ్యక్తి రమజాన్ నెలవంక చూసానని సాక్ష్యమిస్తే నమ్మాలి. షవ్వాల్ నెలవంక విషయంలో మాత్రం విశ్వాసం గల ఇద్దరు వ్యక్తుల సాక్ష్యం తప్పనిసరి.

2- ప్రవక్త ఆదేశం:

فَإِنْ غُمَّ عَلَيْكُمْ فَأَكْمِلُوا الْعِدَّةَ ثَلَاثِينَ

**"మేఘాలు క్రమ్ముకొని ఉన్నప్పుడు మీరు 30 రోజుల లెక్క పూర్తి చేయండి" ప్రకారం షాబాన్ నెల 30 రోజులు పూర్తి అయిన తర్వాత 31వ రోజు రమజాన్ యొక్క మొదటి రోజు అగును.** (బుఖారి 1907, ముస్లిం 1081).

## ఎవరిపై ఉపవాసం విధిగా లేదు? — من يرخص لهم الفطر

1- **రోగి:** స్వస్థత పొందే నమ్మకం ఉన్న వ్యాధిగ్రస్తుడు. అతనికి ఉపవాసం ఉండుట కష్టంగా ఉంటే, కష్టం ఉన్న రోజుల్లో ఉపవాసం మానుకొని, అన్ని రోజుల ఉపవాసం తర్వాత ఉండాలి.

స్వస్థత పొందే నమ్మకం లేని వ్యాధిగ్రస్తుడు ఉపవాసం ఉండనవసరం లేదు. కాని ప్రతి ఒక్క ఉపవాసానికి బదులుగా ఒక బీదవానికి కడుపు నిండా అన్నం పెట్టాలి. లేదా ఎన్ని రోజుల ఉపవాసం మానేశాడో లెక్కేసుకొని అంత మంది బీదవాళ్ళకు ఒకే రోజు విందు చేయవచ్చు.

2- **ప్రయాణికుడు:** ఇంటి నుండి వెళ్ళి తిరిగి వచ్చే వరకు ఉపవాసం మానేయవచ్చును. అయితే అక్కడ నివసించే ఉద్దేశం ఉండ కూడదు.

3- **గర్భిని, పసి బిడ్డలకు పాలిచ్చు తల్లి:** తనకు లేదా పసిబిడ్డకు అనారోగ్య భయం ఉన్నచో ఉపవాసం మానేసి, ఈ ఆటంకం దూరమయ్యాక అన్ని రోజుల ఉపవాసం వేరే రోజుల్లో ఉండాలి.

4- **ఉపవాసముండే శక్తి లేని వృద్ధులు:** వారు ఉపవాసం మానుకోవచ్చు. కాని ఒక రోజుకు బదులుగా ఒక బీదవానికి అన్నం పెట్టాలి.